తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 39 | బుధవారం 04.11. 2026 | పేజీలు :4 | వెల: 2

కుప్పంకు కృష్ణాజలాలు రేవంత్ గురుదక్షిణే..



ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ ఇచ్చేందుకు 700 కి.మీ. దూరంలోని కుప్పంకు కృష్ణాజలాలను తరలించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ధ్వజుమెత్తారు. పాలమూరును ఎండబెట్టి దిగువకు వరుదను వదిలిపెట్టిన ఘనత అసమర్థ పాలకుడు రేవంత్‌కే చెల్లుతుందన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఎండిన పంటలను ఆయన మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో హరీశ్ మాట్లాడారు. నీళ్లకు, కరెంటుకు, పంటలకు సెలవు ఇవ్వాలంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన బాధ్యతల నుంచి సెలవు ఇచ్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు. శ్రీశైలానికి 221 టీఎంసీలు, జూరాలకు 252 టీఎంసీల నీళ్లు వచ్చినా.. సకాలంలో వరద జలాలను సద్వినియోగం చేసుకుని చెరువులు, రిజర్వాయర్లను నింపుకునే ప్రయత్నం చేయకపోవడంతో పాలమూరు జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, వచ్చేది కేసీఆర్ సర్కారేనని, మళ్లీ పాలమూరులో పసిడి పంటలు పండేలా సాగునీటి వనరులను సమకూరుస్తామని చెప్పారు.

కేఎల్ఐ లిఫ్ట్‌లోని మోటార్లు పూర్తిస్థాయిలో నడిస్తే.. నెలకు పది టీఎంసీల చొప్పున ఇప్పటి వరకు 50 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉన్నా.. ఇప్పటి వరకు లిఫ్ట్ చేసింది కేవలం 18 టీఎంసీలేనని, మిగతా నీటిని గురువు చంద్రబాబుకు వదిలిపెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డిలో వారం రోజుల్లో తీసే మట్టి తవ్వకం కూడా చేపట్టలేని చేతగాని ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయిన్నారు. ఒక్క అల్వాల గ్రామంలోనే 250 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా.. రైతులు, రైతుకూలీలకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, సాయం ఏమి చేస్తారో చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రాకు వరదలొస్తే పరిగెత్తుకొచ్చిన కేంద్ర బృందాలు తెలంగాణలో కరువు వస్తే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాలనే ధ్యాస రాష్ట్రాన్ని పాలిస్తున్న రేవంత్‌రెడ్డికి, కేంద్ర మంత్రులకు, బీజేపీకి లేకపోవడం బాధాకరమన్నారు.



ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం..

అరాచకవాదాన్ని అంతం చేద్దాం..!

నిర్మల్ మహా పాదయాత్రలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి, చిత్రంలో బండి సంజయ్, ఈటల, రాంచంద్రా రావు, తదితరులు

ప్రజా సమస్యలు గాలికి.. ఢిల్లీ రాజకీయాలకే ప్రాధాన్యమా..?

- ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- ఓటు చోరీ ఆరోపణలకు ఆధారాలేవీ? రాహుల్ గాంధీకి ప్రశ్న
- నిర్మల్‌లో నిర్వహించిన మహా పాదయాత్ర గ్రాండ్ సక్సెస్

ప్రజాస్వామ్యాన్ని రక్షించి, అరాచకవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ నిరంతర పోరాటం సాగిస్తుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్‌లోని కుట్రదారులకు, ఢిల్లీలోని గుంటనక్కలకు వినిపించేలా వందేమాతరం నినాదాలు మార్మోగాలని పిలుపునిచ్చారు. వర్షం పడటం శుభసూచకమని, తెలంగాణలో రాబోయేది కాషాయ జెండా పాలనేనని ధీమా వ్యక్తం చేశారు. ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ రాకే ఇందుకు నిదర్శనమన్నారు. ఆయనకు స్వాగతం పలుకుతూ, వర్షాన్నిసైతం లెక్కచేయకుండా మూడు కిలోమీటర్ల మహా పాదయాత్రలో పాల్గొన్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

హైదరాబాద్ సూర్యోదయ వార్త

ఢిల్లీలో నలుగురిని పోగేసుకొని కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని, దేశ ప్రజలు ఆ పార్టీ తీరును గమనిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌ను క్రాక్రోచ్ పార్టీగా అభివర్ణిస్తూ విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవానికి ఆయన చేస్తున్నది పేరు చోరీ రాజకీయాలని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ రాజకీయాల

'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ డ్రామాలు

తెలంగాణలో ఎగిరేది కాషాయ జెండానే..

రామచంద్రరావు నాయకత్వంలో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తాం

కేంద్ర మంత్రి బండి సంజయ్



ఏఐ భూతం కాదు.. సాంకేతిక రంగంలో అద్భుతం

- 'క్యాంపస్ హబ్ ఏఐ' ఆవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్
- ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్, నిర్వాహకులు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

రాయదుర్గం, కృత్రిమ మేధ(ఏఐ)ను భూతంలా చూడొద్దని.. సాంకేతిక రంగంలో అదో అద్భుతమని ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. హైదరాబాద్ నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలను అనుసంధానించే ఎడ్యుకేషన్ ఆపరేటింగ్ సిస్టం 'క్యాంపస్ హబ్ ఏఐ'ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు."గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు వినూత్న ఆలోచనలతో 'క్యాంపస్ హబ్ ఏఐ'ను ప్రారంభించడం అభినందనీయం. యువత గొప్పగా ఆలోచించి ఉన్నతంగా ఎదగాలి. భారాస ప్రభుత్వం ఐటీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఐటీ రంగం నగరంలోనే కేంద్రీకృతం కాకుండా, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉంది. అక్కడా ఐటీ సంస్థల ఏర్పాటుకు ముందుకు రావాలి. పరకాలలో ఓ యువకుడు ఐటీ సంస్థను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించడం హర్షణీయం.ప్రభుత్వం ఏఐని మరింత ప్రోత్సహించి, అవసరమున్న చోట వినియోగించుకోవాలి. భారాస అధికారంలోకి వచ్చాకా.. ప్రభుత్వ శాఖలకు ఏఐని అనుసంధానం చేసి, మెరుగైన సేవలు అందేలా చూస్తాం" అని అన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, క్యాంపస్ హబ్ ఏఐ వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

అనిల్ అంబానీ గ్రూపుపై 'ఈడీ' కొరడా


రెండు చార్టర్డ్ విమానాలు అటాచ్

రూ.510 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్

ఇప్పటివరకు రూ.23,100 కోట్ల ఆస్తుల స్వాధీనం

- వివరాలు 2 లో..





ఓటు హక్కుపై వేటు వేస్తే సహించం

ప్రజల ఓటుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదు

ప్రక్షాళన పేరుతో అర్హుల పేర్లు తొలగిస్తే అది హక్కుల హననమే

ఎన్నికల ప్రక్రియపై సందేహాలకు ఆధారాలతో సమాధానమివ్వాలి

ఓటు హక్కు పరిరక్షణకు రాహుల్ గాంధీ పోరాటం దేశానికి దిక్సూచి

మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- వివరాలు 2 లో..

గ్రాడ్యుయేట్ ఓటుకు గడువు పొడిగింపు

- నామినేషన్ల ప్రక్రియ ముగిసే చివరిరోజు వరకు ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చు
- డిసెంబర్ 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వెల్లడి



కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి

- కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కృషి చేయాలి
- కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరాలి.. ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందాలి
- కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





నకిలీ నోట్లకు పోలీసు ముసుగు

కుంట్లూరు కేంద్రంగా కోట్ల నకిలీ కరెన్సీ దందా

- రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు
- రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం
- నలుగురు అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
- డమ్మీ తుపాకులు, వాకీటాకీలు, నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు స్వాధీనం

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు

ముంపు భూముల పరిహారానికి సిద్ధం..

- నిధులు జాయింట్ అకౌంట్‌లో జమ
- ముంపు వివరాలతో పూర్తి నివేదిక సిద్ధం చేయాలి
- గత ఒప్పందాలు, సంబంధిత పత్రాలు మహారాష్ట్రకు అందజేయాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు



హైదరాబాద్ సూర్యోదయ వార్త

తుమ్మిడిహట్టి బ్యారేజ్ పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని వారికి సూచించారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని

- మిగతా 2 లో..

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సదాశివపేట ఏవో



ఏటూరునాగారంలో పందుల స్వైర విహారం..!

- ఇళ్లలోకి చొరబడే తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్న పందులు..
- అధికారులు వెంటనే స్పందించి పందుల

బెడదను నివారించాలని కోరుతున్న స్థానికులు.



ఏటూరు నాగారం. నవంబర్ 03- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)
ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో పందల సంఖ్యలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇళ్ల పరిసరాల్లోకి చొరబడుతూ అపరిశు భ్రతకు కారణమవుతున్నాయి. పందుల పెంపకదారులు గ్రామపంచాయతీ అధికారులు సూచనలు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పందుల బారిన ప్రజలు రోగాల బారిన పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు..

కంటైనర్ పాఠశాలతో తొలగిన ఇబ్బందులు...



సూర్యోదయ వార్త . ఏటూరు నాగారం. నవంబర్ 03
– ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం మామిడి కూడా గుత్తి కోయ పిల్లల చదువులకు ఏర్పాటుచేసిన కంటైనర్ పాఠశాలతో విద్యార్థుల ఇబ్బందులు తొలగిపోయాయి. గత కొన్నేళ్లుగా సరైన భవనం లేక వానకు తడుస్తూ. ఎండకు ఎండకు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. ఈ విషయంపై పలువురు మండల నాయకులు. మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన సీతక్క ఇటీవల కంటైనర్ పాఠశాల ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. దీంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి వచ్చాయి..

మంగపేట నూతన ఎస్సై మధుకర్ కు సన్మానం..

నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసినమంగపేట ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ...



మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 03 (సూర్యోదయ వార్త)
మంగపేట పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మధుకర్‌ను మంగపేట మండల ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఆదివాసి ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు కార్యక్రమంలో ఆదివాసి ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షులు పొలేబోయిన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, జెఏసి నాయకులు పునెం రాములు, తోలేం సుధాకర్, కొమరం రవి, ఈసం కృష్ణ, గొప్ప చంద్రకాంత్, ఆక తిరుమల రావు, తోలేం నరేష్,పునెం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట నూతన ఎస్సైగా మధుకర్..

మంగపేట. నవంబర్ 03 (సూర్యోదయ వార్త)



ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా మధుకర్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండపేటలో గతంలో విధులు నిర్వహించిన టీవీఆర్ సూరి ములుగు స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా మధుకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఎస్సై కి అభినందనలు తెలిపారు.

బోర్ నర్సాపురంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ..

మంగపేట తహసిల్దార్ . తోట రవీందర్..



మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 03- (సూర్యోదయ వార్త)
ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని బోర్ నర్సాపురం ఎస్ టి కాలనీ డీలర్ సేల్స్ డిపో -2 వద్ద మంగళవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా హాజరైన మంగపేట మండలం తహసిల్దార్ తోట రవీందర్ ప్రభుత్వ అధికారుల సమక్షంలో 170 మంది రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట రెవిన్యూ ఇన్స్పెక్టర్. శ్రీనివాస్. జిపిఓ. రాములు. సేల్స్ డిపో డీలర్. కోరం కవిత. బోర్ నర్సాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు. రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు...

పెనుగోలు భూములకు పట్టాలు ఇవ్వాలి


- అదనపు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన.
- ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి..
- వందల ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు..



వెంకటాపురం. నూగూరు. నవంబర్ 03(సూర్యోదయ వార్త శ్రీ
– వందల ఏళ్లుగా అడవులను కొండ లను నమ్ముకొని బ్రతుకుతున్న పెనుగోలు ఆదివాసీల సాగు భూములు ప్రాజెక్ట్ ల పేరుతో తీసుకోవద్దని పెనుగోలు ఆదివాసీలు ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆధ్వర్యంలో ములుగు అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్ జీ ని కలిసి వినతిపత్రం అందజేసినట్టు మీడియకు తెలిపారు. మంగళవారం ములుగు కలెక్ట్రెట్ లో కలిసినట్టు నర్సింహా మూర్తి తెలిపారు. రెవిన్యూ అధికారులు పెసా గ్రామసభలను, 1/59, 1/70, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను గౌరవించకుండా తమ ఇష్టాను సారంగా మోడీ కుంట ప్రాజెక్ట్ కు భూములు ఇస్తున్నట్టు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. వందల ఏళ్లుగా పెనుగోలు ఆదివాసీలు ఎటువంటి ప్రభుత్వ సేవలకు నోచుకోలేదని ఆయన అన్నారు. విద్య, వైద్య సేవలు పొందలేదని అన్నారు. నేటికీ భారత దేశ పటం లో ఈ గ్రామానికి చోటు దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెనుగోలు గ్రామానికి రోడ్డు మార్గం లేదని, అనారోగ్య సమస్యలు వస్తే గుట్టల మధ్య నుండి జోలే కట్టి మోసుకురావడం తప్ప మరో మార్గం లేదన్నారు. పాముసూరు, జెల్లా, డోలి, తడపల, చెలిమల, ముకునూరు గ్రామాలకు అక్కడ ప్రజలు లేకున్నా కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు వేసిన ప్రభుత్వం పెనుగోలు గ్రామంలో ప్రజలు ఉన్నప్పటికీ రోడ్డు ఎందుకు వేయడం లేదని ఆయన అదనపు కలెక్టర్ ని ప్రశ్నించినట్టు తెలియ జేసారు . కర్రెగుట్టలకు రోడ్డు వేయడానికి ఎటువంటి అంక్షలు పెట్టని అటవీ శాఖ పెనుగోలు గ్రామానికి రోడ్డు వేయడానికి ఎందుకు ఆంక్షలు పెడుతున్నారని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం అడవి నుండి ఆదివాసీలను వేరు చేయడం, నీటి నుండి చేపను వేరు చేయడం ఒకటే అని వ్యాఖ్యణించినట్టు ఆయన తెలిపారు.ఐదో పంచవర్షిక ప్రణాళికలో ఆదివాసీలు ఎక్కడ ఉంటే అక్కడే వాళ్ళను అభివృద్ధి చేయాలనీ అడవి నుండి బయటకు తెచ్చి నిర్వాసితులను చేయొద్దని చెప్పినట్టు గుర్తు చేశారు. వందల ఏళ్లుగా పెనుగోలు గ్రామానికి ప్రభుత్వ సేవలు అందలేదన్నారు. ఏనాడూ పెనుగోలు గ్రామాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు వాళ్ళ భూములను మోడీకుంట ప్రాజెక్ట్ కు అప్పగించడానికి ప్రయత్నించడం సరికాద న్నారు. ఇన్నేళ్లు మాకు ప్రభుత్వం రోడ్డు వేయకపోయినా, వైద్య, విద్య సేవలు అందించకపోయినా, మా బ్రతుకు మేము బ్రతికినం కానీ ఇప్పుడు మా భూములను తీసుకోవద్దని ఆదివాసీలు మహేందర్ జీ ని వేడుకున్నట్లు వివరించారు. జపాన్ లాంటి దేశాల్లో ఒక విద్యార్థి కోసం రైలు వేశారని, ఆరుగురు ఆదివాసీలను రక్షించడానికి వారి కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసారని ఇక్కడ ప్రభుత్వం ఆ విధంగా ఎందుకు చేయడం లేదన్నారు. పెనుగోలు గ్రామానికి పట్టాలు ఇచ్చే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఎన్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, ఏ ఎన్ ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం అజయ్, పాయం కృష్ణమూర్తి, బొగ్గుల నారాయణ, శివాజీ, ఉయిక సురేష్, రాజేష్ గోపాల్ తదితర రైతులు పాల్గొన్నారు..

భూభారతి పెండింగ్ దరఖాస్తులు.. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలి
- జీవో 59, 76 పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- హైకోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్





ములుగు నవంబర్. 03- (సూర్యోదయ వార్త)
భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంతోపాటు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రెవెన్యూ అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, రీసర్వే, హైకోర్టు కేసులు, భూభారతి పాత, కొత్త దరఖాస్తుల క్రమబద్ధీకరణ అంశాలపై ఆయన సమీక్షించారు. ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. పాత, కొత్త దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.రీసర్వేను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ వేగంగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జీవో నంబర్లు 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. యూఎల్‌సీ భూములు, జీవో నంబర్ 118కు సంబంధించిన పెండింగ్ అంశాలపైనా సమీక్షించారు.హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విజిలెన్స్ కేసులు, భూదాన్ నివేదిక, భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాల పురోగతిని సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, మంజుల, తహసీల్దార్ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

నూతన ఎస్సై మధుకర్‌కు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సన్మానం..



మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 03 (సూర్యోదయ వార్త)
– ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీ మధుకర్ కు మంగళవారం మంగపేట జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల తరఫున మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. మంగపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు వారి సేవలు మరింత విజయవంతం కావాలని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్.,ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్.ఉపాధ్యక్షులు పుల్లం శెట్టి అజయ్ , గంగుల చంటి , వై విరన్ కుమార్ , కార్యదర్శులు పున్నెం భాస్కర్ , గోలి నరేష్ ,నిమ్మల నరేష్, కోశాధికార్లు నూతల కంటి ఈశ్వర్ చందు. ప్రచార కార్యదర్శులుగా గగ్గూరి మహేష్, మమ్మద్ ఖాజా పాషా, మామిల్ల నాగరాజు, గౌరవ సలహాదారులుగా కోలగట్ల నరేష్ రెడ్డి , చాదా మల్లయ్య సిద్ధంశెట్టి కన కారావు లిక్కి రమేష్ కార్యవర్గ సభ్యులు సాంబశివరావు,సతీష్,అనిల్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ కట్టడాల పరిరక్షణలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలి..

- రామప్ప విశిష్టతపై విస్తృత అవగాహన కల్పించాలి..
- ములుగు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు



వెంకటాపూర్. ములుగు నవంబర్. 03 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)
వారసత్వ సంపద విశిష్టతను ప్రపంచానికి చాటడంలో, చారిత్రక కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించడంలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు అన్నారు.మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్--2026 ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీధర్ రావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర, పురావస్తు, వారసత్వ కట్టడాల సంరక్షణపై ఆసక్తితో శిక్షణకు హాజరైన వాలంటీర్లను అభినందించారు. రామప్ప దేవాలయ విశిష్టతను, శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరింత మందికి తెలియజేయాలని సూచించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలు యువతకు కెరీర్‌పరంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలిని తెలుసుకునేందుకు ఇవి అవకాశం కల్పిస్తాయన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇతరులకు తెలియజేస్తూ కాకతీయుల కీర్తిని ప్రపంచానికి చాటేలా వాలంటీర్లు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చల్లగొండ రాజు,పర్యాటక శాఖ గైడ్లు గోరంటల విజయ్ కుమార్, వెంకటేష్, రాష్ట్ర పురావస్తు శాఖ ఫోర్‌మన్ బాబు, టూరిస్ట్ పోలీసులు అరుణ్, భద్రు, సంబంధిత శాఖల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు...



సప్త వర్ణ శోభ.. రంగు దిద్దిన ఆకాశం..

ములుగు. నవంబర్ 03(సూర్యోదయ వార్త)

–ములుగు జిల్లాలో వర్షం కురిసి వెలి సిన అనంతరం సాయంత్రం వేళ ఆకాశం అద్భుత రంగులతో కనువిందు చేసింది. నారింజ. పసుపు. ఎరుపు రంగుల మేలనింపుతో మేఘాలు స్వప్త వర్ణ శోభ ను సంతరించుకున్నాయి. పకృతి అందాలకు అద్దం పట్టేలా ఆకాశంలో ఆవిష్కృతమైన ఈ అద్భుత దృశ్యం చూపర్లను కట్టిపడేసింది. పకృతి ప్రేమికులను మంత్ర ము గ్ధులను చేసిన ఈ సాయంత్రం అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కుట్టు మిషన్ శిక్షణ పూర్తి...!



- కన్నాయిగూడెం. ములుగు జిల్లా. నవంబర్ 03- (సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం పరిధిలో ఐటీడీఏ నిర్వహిస్తున్న కుట్టు మిషన్ ట్రైనింగ్ 75 రోజులు పూర్తి చేసుకుంది. మహిళల్లో ఆత్మవిశ్వాసం. నైపుణ్యాలను పెంపొందిస్తూ. స్వయం ఉపాధి సాధించే లక్ష్యంతో ఈ శిక్షణ కొనసాగుతుంది. మహిళలు కొత్త విషయాలు నేర్చుకుంటూ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం అభినందనీయమని సర్పంచ్ పీరీల స్వప్న అన్నారు శిక్షణలో పాల్గొన్న మహిళలకు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు..– వర్షం తో దాన్యంపై నిలిచిన నీరు.. రైతుల ఆందోళన.

మండపేట. ములుగు జిల్లా. నవంబర్ 03



(సూర్యోదయ వార్త)– ములుగు జిల్లాలో తుఫాన్ ప్రభావంతో మంగపేట మండలంలో రోజంతా కురిసిన ముసురు వర్షం రైతులను ఆందోళనకు గురిచేసింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై కప్పిన టర్పాలిన్ సీట్లపై వర్షపు నీరు నిలిచింది. వర్షం ఇలాగే కొనసాగితే ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కోతలు కొంతమేర పూర్తి చేసి ధాన్యాన్ని కల్లాలో ఆరబోసిన రైతులు వాతావరణ పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారు..

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తనికెళ్ల, కొణిజర్ల తదితర కరువు ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించింది. సాగు చేయని పొలాలు, నీరు లేని చెరువులు, అధిక ఉష్ణోగ్రతలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడింది. అనంతరం తనికెళ్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ. 25 వేల కోట్ల కరువు నివారణ నిధులు విడుదల చేయాలని, అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా నిధులు కేటాయించి కరువు పనులు చేపట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదై చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదని, దీనివల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని తెలిపారు. గతేడాది ఖరీఫ్‌లో 69.19 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది 57.04 లక్షల ఎకరాలకే పరిమితమైందని పేర్కొన్నారు. సాగు చేయని రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని, కరువు ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో పరిస్థితులను అంచనా వేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు, రూ. 2 లక్షల రుణమాఫీ అందని రైతులకు తక్షణమే మాఫీ చేయాలన్నారు. వరి పంటకు ఎకరాకు రూ. 30 వేలు, వాణిజ్య పంటలకు రూ. 50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, పంచాయతీలకు ప్రత్యేక కరువు నిధులు కేటాయించి ఉపాధి హామీ పనులు, పని దినాలను పెంచాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి, అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

ఎస్సై మధుకర్‌ను సన్మానించిన మంగపేట మండలం పీసా కమిటీ సభ్యులు.

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్. 03(సూర్యోదయ వార్త)

మంగపేట షెడ్యూల్డ్ ప్రాంతంల్లో (ఏజెన్సీ ఏరియాస్) కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ ను పెసా కమిటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగాసన్మానించి,మంగపేట ఏజెన్సీ ప్రాంతంలోవిధి నిర్వహణ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఇట్టి సందర్భంగా ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమల్లో ఉండే 'పెసా చట్టం–1996' ప్రకారం గ్రామసభలకు, స్థానిక గిరిజన కమిటీలకు ఉన్న ప్రత్యేక అధికారాలను ఈ సందర్భంగా ప్రస్తావించడం జరిగింది.గిరిజన ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, స్థానిక ఆచారాలు, సంస్కృతులకు భంగం కలగకుండా, స్థానిక ఆచారాలు, సంస్కృతులను కాపాడాలని పెసా కమిటీలు సబ్–ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మంగపేట వారిని కోరడం జరిగింది.ఇట్టి సంధర్భంగా మంగపేట ఎస్సై దృష్టికి కొన్ని అంశాలతో కూడిన దరఖా స్తును పెసా కమిటీలు ఇవ్వడం జరిగింది .గిరిజన గ్రామాల్లో ఏదైనా వివాదాలు లేదా సమస్యలు వస్తే, చట్టప్రకారం ముందుగా గ్రామసభల ద్వారా లేదా పెసా కమిటీల



సమక్షంలో పరిష్కరించుకునేలా పోలీసు శాఖ సహకరించాలని కోరడం.మరియు ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లో నాటుసారా విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం.అలాగే అమాయక గిరిజన ప్రజలు అనవసరపు కేసుల్లో ఇరుక్కోకుండా చూడాలని, పోలీసు పరిధిలో వారికి తగిన న్యాయం అందించాలని అభ్యర్థించడం జరిగింది.నూతన ఎస్ఐ స్పందిస్తూ, మండలంలో/పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.చట్టపరిధిలో గిరిజన ప్రాంతాల హక్కులను గౌరవిస్తూ, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా నిష్పక్షపాతంగా సేవలందిస్తామని హామీ ఇచ్చారని పెసా మండల అధ్యక్షులు జోగా నరేందర్ తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో పెసా మండల ఉపాధ్యక్షులు మడి శోభన్ బాబు,ప్రధాన కార్యదర్శి పాయం రమేష్,కోశాధికారి తాటి విజయ్ బాబు,పెసా ములుగు జిల్లా అధ్యక్షులు డబ్బుల ముత్యాలరావు, పుసం కార్తిక్, జబ్బా కర్నాకర్, చౌలం సాయి బాబు, యాలం రమేష్,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాల నమోదులో జాప్యం ఉండొద్దు..

- **ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో..**
- **తాడ్వాయి బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ..**
- **పోర్టల్ నమోదుల పురోగతిని పరిశీలించి, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**
- **తాడ్వాయి. ములుగు జిల్లా. నవంబర్ 03**

- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి 03

– తడ్వాయి: గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ పోర్టల్స్‌లో సక్రమంగా నమోదు చేయడంతో పాటు, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులకు సూచించారు.ఈ మేరకు పీఓ తాడ్వాయి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు సంబంధించిన వివరాలు యుడబ్ల్యూ హెచ్ఎం , ఎఫ్ ఆర్ ఎస్ పోర్టల్స్‌లో నమోదు చేశారా లేదా అనే అంశంపై తనిఖీ నిర్వహించారు. పోర్టల్స్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి, ఇంకా నమోదు చేయాల్సినవి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ, విద్యార్థులకు





సంబంధించిన అన్ని వివరాలను నిర్దేశిత పోర్టల్స్‌లో ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నమోదులను వెంటనే పూర్తి చేయాలని, ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను మరోసారి సరిచూసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు అర్హులైన ప్రతి విద్యార్థికి అందేలా రికార్డులు, ఆన్‌లైన్ నమోదులు సమగ్రంగా ఉండాలని తెలిపారు. సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో భారీ నకిలీ కరెన్సీ తయారీ

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో నకిలీ కరెన్సీ తయారీకి పాల్పడుతున్న ముఠా గుట్టును ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. నగర శివారు కుంట్లూరులో రహస్యంగా ఏర్పాటు చేసిన నకిలీ కరెన్సీ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నోట్ల ముద్రణకు ఉపయోగించిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్కానర్లు, లామినేషన్, కటింగ్ యంత్రాలతో పాటు నకిలీ తుపాకీ, కారు, నకిలీ నంబర్ ప్లేట్లు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి వెల్లడించిన వివరాల ప్రకారం.. విజయవాడకు నకిలీ కరెన్సీ తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, మహేశ్వరం జోన్, షాద్‌నగర్ ఎస్ఓటీ బృందాలు రంగంలోకి దిగాయి. రామోజీ ఫిల్మ్ సిటీ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న బాలాజీ ధాబా సమీపంలో జాతీయ రహదారి-65పై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మారుతి డిజైర్ కారులో ప్రయాణిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఓ బ్యాగులో నకిలీ రూ.500 నోట్ల కట్టలు లభించాయి. తొలుత 16 కట్టల్లో ఉన్న 1,600 నోట్లను గుర్తించిన పోలీసులు, నిందితులను విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.నిందితులు కుంట్లూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ కరెన్సీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అసలు రూ.500 నోట్లను స్కాన్ చేసి, ఫొటోషాప్ సాఫ్ట్‌వేర్ ద్వారా వాటి చిత్రాలను మార్పులు చేసి కలర్ ప్రింటర్ల సాయంతో నకిలీ నోట్లను ముద్రించినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా ద్వారా నకిలీ నోట్ల తయారీకి సంబంధించిన పరిజ్ఞానాన్ని నేర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముద్రించిన నోట్లకు లామినేషన్ చేసి, కత్తిరించి మార్కెట్లో చలామణి చేసేందుకు



ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.
నకిలీ కరెన్సీ తయారీ ప్రయత్నాల్లో విఫలమైన సమయంలో నిందితులు మరో మార్గాన్ని ఎంచుకున్నట్లు విచారణలో తేలింది. నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, డమ్మీ పిస్టల్, వాకీటాకీలతో పోలీసులుగా నటిస్తూ నకిలీ నోట్ల కొనుగోలుదారులను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు న్నాయి. ఇద్దరు వ్యక్తుల నుంచి విడివిడిగా రూ.2 లక్షలు, రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షలు వసూలు చేసి పంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

బోల్తాపడి ఐదుగురు విద్యార్థులకు గాయాలు

విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన కాలేజీ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. మద్యం మత్తులో వాహనం నడపడమే కాకుండా, వ్యాన్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కిం చడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. ఆదిబట్ల సీఐ ఎస్. రమేష్ తెలిపిన వివ రాల ప్రకారం.. కోహెడ రోడ్డులోని శ్రీ గురు జూనియర్ కళాశాలలో కోహెడకు చెందిన ధనుష్ (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. కళాశాల వ్యాన్‌లో విద్యార్థులను తరలించే సమయంలో వాహన సామర్థ్యానికి మించి 15 నుంచి 18 మంది వరకు ఎక్కిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ నెల 2న సాయంత్రం 5 గంటల సమయంలో డ్రైవర్ ఫణి మద్యం మత్తులో వ్యాన్ నడుపుతూ తుర్కయంజాల్, బ్రాహ్మణపల్లి పరిధిలోని వేదికా రిసార్ట్ ఎదురుగా అదుపుతప్పి బోల్తాపడ్డాడు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న విషయాన్ని గమనించిన విద్యార్థులు ముందుగానే హెచ్చరించినప్పటికీ అతడు పట్టించుకోలేదని ఫిర్యాదుదారుడు తెలిపారు.
ఈ ప్రమాదంలో ధనుష్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఘటనపై ధనుష్ సోద రుడు ఏ. సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు



చేశారు. విద్యార్థుల భద్రతను పట్టించుకోని కళాశాల యాజమాన్యంతో పాటు మద్యం మత్తులో వ్యాన్ నడిపిన డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు.



మన శరీరంలోని మలినాలను, వ్యర్థ పదార్థాలను వడకట్టి రక్తాన్ని శుద్ధి చేసే అత్యంత కీలకమైన అవయవాలు 'కిడ్నీలు'. అయితే, ప్రస్తుత కాలంలో చాలా మందిని వేధిస్తున్న అతిపెద్ద ఆరోగ్య సమస్యల్లో 'కిడ్నీలో రాళ్లు' ఏర్పడటం ఒకటి. కిడ్నీలో రాళ్లు వస్తే వచ్చే ఆ నరకప్రాయమైన నొప్పిని భరించడం ఎవరి తరమూ కాదు. సాధారణంగా నీళ్లు తక్కువగా తాగడం వల్లే కిడ్నీలో రాళ్లు వస్తాయని చాలా మంది భావిస్తారు. అంతర్జాతీయ వైద్య నివేదికల ప్రకారం.. మనం రోజువారీ ఆహారంలో తీసుకునే కొన్ని ఆరోగ్యకరమైన పదార్థాలను అతిగా తినడం వల్ల కూడా కిడ్నీలలో క్యాల్షియం ఆక్సలేట్ స్ఫటికాలు పేరుకుపోయి రాళ్లుగా మారుతాయట. మరి అతిగా తింటే కిడ్నీలను ప్రమాదంలోకి నెట్టేసే ఆ ఆహార పదార్థాలు ఏంటో ఇప్పుడు పూర్తి వివరంగా తెలుసుకుందాం.

పాలకూర ఆరోగ్యానికి ఎంతో మంచిదే అయినప్పటికీ, ఇందులో 'ఆక్సలేట్' అనే సమ్మేళనాలు చాలా ఎక్కువగా ఉంటాయి. అలాగే టమోటా గింజలలో కూడా ఆక్సలేట్లు ఉంటాయి. మనం వీటిని మితిమీరి తీసుకున్నప్పుడు, ఆ ఆక్సలేట్లు శరీరంలోని క్యాల్షియంతో కలిసి 'క్యాల్షియం ఆక్సలేట్' రాళ్లుగా మారుతాయి. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు పాలకూర, టమోటాలను పరిమితంగానే తీసుకోవాలి. మన కూరల్లో వాడే ఉప్పు (సోడియం) కిడ్నీలకు పెద్ద శత్రువు. చిప్స్, పచ్చళ్లు, ఫాస్ట్ ఫుడ్స్ మరియు ప్యాక్ చేసిన ఆహారాలలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. శరీరంలో సోడియం శాతం పెరిగినప్పుడు, అది మూత్రం ద్వారా ఎక్కువ క్యాల్షియం బయటకు వెళ్లేలా చేస్తుంది. ఈ క్యాల్షియం కిడ్నీలలో పేరుకుపోయి సులభంగా రాళ్లుగా మారుతుంది. మటన్, చికెన్, గుడ్లు వంటి జంతు ప్రోటీన్లను ప్రతిరోజూ అతిగా తినడం వల్ల శరీరంలో 'యూరిక్ యాసిడ్' స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు మూత్రం ఆమ్లత్వంగా మారి, కిడ్నీలలో యూరిక్ యాసిడ్ రాళ్లు మరియు క్యాల్షియం రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని డబుల్ చేస్తుంది.

జ్యూస్‌లలో 'ఫ్రక్టోజ్' చక్కెరలు, 'ఫాస్ఫారిక్ యాసిడ్' ఎక్కువగా ఉంటాయి. ఇవి మూత్రంలోని ఖనిజాల సమతుల్యతను దెబ్బతీస్తాయి. వారానికి రెండు మూడు సార్ల కంటే ఎక్కువగా సాఫ్ట్ డ్రింక్స్ తాగే వారిలో కిడ్నీ స్టోన్స్ వచ్చే అవకాశం 23% ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల మంచి నీటిని ఖచ్చితంగా తాగాలి. నీరు ఎక్కువగా తాగడం వల్ల కిడ్నీలలోని వ్యర్థాలు ఎప్పటికప్పుడు కొట్టుకుపోతాయి.



వాడే జీలకర్ర అసలైనదేనా?..

వంటకాలలో ఉపయోగించే జీలకర్ర విషయంలో కూడా కల్తీ ముప్పు పెరుగుతోంది. మార్కెట్లో నకిలీ లేదా కృత్రిమ రంగులు కలిపిన జీలకర్ర విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కల్తీ జీలకర్ర వంటకాల రుచిని తగ్గించడమే కాకుండా ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మన వంటకాలలో జీలకర్రకు ప్రత్యేక స్థానం ఉంది. కూరలు, పప్పులు, మసాలా వంటకాలతో పాటు ఆయుర్వేద కషాయాలు, ఆరోగ్య పానీయాల్లో కూడా జీలకర్రను విరివిగా ఉపయోగిస్తారు. అయితే ఇటీవల కాలంలో మార్కెట్లో కల్తీ ఆహార పదార్థాల సంఖ్య పెరుగుతుండటంతో నకిలీ లేదా కృత్రిమ రంగులు కలిపిన జీలకర్ర విక్రయాలు కూడా అధికమయ్యాయి. ఇలాంటి కల్తీ జీలకర్ర వంటకాల రుచిని తగ్గించడమే కాకుండా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

అందుకే జీలకర్ర కొనుగోలు చేసే ముందు దాని స్వచ్ఛతను గుర్తించడం ఎంతో ముఖ్యం. అసలైన జీలకర్రకు ప్రత్యేకమైన ఘాటైన సహజ సువాసన ఉంటుంది. గింజలను చేతిలో తీసుకుని వాసన చూసినప్పుడు బలమైన సుగంధం వస్తుంది. కానీ నకిలీ లేదా నాణ్యతలేని జీలకర్రలో సువాసన తక్కువగా ఉండటం లేదా రసాయనాల వాసన రావడం గమనించవచ్చు. అలాగే అసలైన జీలకర్ర గింజలు సాధారణంగా గోధుమ రంగులో ఒకే ఆకారంలో ఉంటాయి. కల్తీ జీలకర్ర గింజలు అసమాన



ఆకారంలో ఉండటంతో పాటు మరీ ముదురు రంగులో కనిపించే అవకాశం ఉంది. జీలకర్ర నాణ్యతను తెలుసుకునేందుకు ఇంట్లోనే ఒక సులభమైన పరీక్ష చేయవచ్చు. ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్ర వేసి కొద్దిసేపు ఉంచాలి. స్వచ్ఛమైన జీలకర్ర బరువుగా ఉండటంతో సాధారణంగా అడుగునకు చేరుతుంది. కానీ మట్టి, ఇసుక లేదా ఇతర కల్తీ పదార్థాలు కలిపి ఉంటే అవి నీటి పైభాగంలో తేలిపోతాయి. అలాగే జీలకర్ర వేసిన వెంటనే నీటి రంగు మారితే, దానిలో కృత్రిమ రంగులు కలిపి ఉండే అవకాశం ఉందని అర్థం.

రోగకారక క్రిముల పెరుగుదలను తగ్గిస్తుంది.. వైరస్‌లు, బ్యాక్టీరియాలు ఇది రోగకారక క్రిముల పెరుగుదలను తగ్గించి, రోగనిరోధక కణాలను చురుకుగా చేస్తుంది. కానీ, అధిక జ్వరం లేదా ఎక్కువ రోజులు కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. ఇది వర్షాకాలం.. అంటే జ్వరాల సీజన్. వాతావరణ మార్పు, వర్షాలు, సీజనల్ వ్యాధుల వ్యాప్తి.. ఇలా కారణం ఏదైనా ఈ కాలంలోనే చాలా మంది అనారోగ్యానికి గురవుతుంటారు. ఎక్కువమంది జ్వరంతో బాధపడతారు. అయితే మన పెద్దలు కనీసం ఏడాదికి ఒక్కసారైన జ్వరం రావాలని అంటూ ఉంటారు.

ఈ మాట మీరు కూడా వినే ఉంటారు. వాళ్లు అలా ఎందుకు అంటారు? దాని వెనుక కారణాలు ఏంటి? జ్వరం వస్తే మంచిదేనా? ఇలాంటి ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. చాలా మందికి జ్వరం అంటే కేవలం అనారోగ్యానికి సిగ్నల్ అనుకుంటారు కానీ నార్మల్ ఫీవర్ వస్తే మన బాడీ ఇన్‌ఫెక్షన్‌తో పోరాడేందుకు ఉపయోగించే సహజ రక్షణ వ్యవస్థలో భాగంగా పనిచేస్తుంది. అయితే అధిక జ్వరం లేదా ఎక్కువ రోజులు కొనసాగే జ్వరం మాత్రం ప్రమాదకరమనే విషయం గుర్తుంచుకోవాలి.

రోగకారక క్రిముల పెరుగుదలను తగ్గిస్తుంది.. వైరస్‌లు, బ్యాక్టీరియాలు ఇది రోగకారక క్రిముల పెరుగుదలను తగ్గించి, రోగనిరోధక కణాలను చురుకుగా చేస్తుంది.. జ్వరం వచ్చినప్పుడు తెల్ల రక్తకణాలు, యాంటీబాడీలు, ఇతర రోగనిరోధక కణాలు మరింత సమర్థంగా పనిచేసి ఇన్‌ఫెక్షన్‌ను ఎదుర్కొనేందుకు సహాయపడతాయి.

శరీరం పోరాడుతోందనే సంకేతం.. జ్వరం అనేది శరీరం ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించి దానికి వ్యతిరేకంగా చర్యలు ప్రారంభించిందనే సూచన. కోలుకోవడాన్ని వేగవంతం చేసే అవకాశం..

కొన్ని వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లలో స్వల్ప జ్వరం ఉండటం వల్ల శరీరం త్వరగా కోలుకునేందుకు సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే జ్వరం వస్తే మంచిదే కదా అని జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం మంచిది కాదు. 103ళీఈ (39. 4ళీఅ) లేదా అంతకంటే ఎక్కువ జ్వరం ఉన్నా, జ్వరం 2- 3 రోజులకంటే ఎక్కువ కొనసాగినా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన తలనొప్పి, మూర్ఛ, గందరగోళం వంటి లక్షణాలు కనిపించినా, చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు లేదా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి జ్వరం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఒక్క విషయం.. జ్వరం అనేది వ్యాధి కాదు.

బలాన్నిచ్చే క్యారెట్ మిల్క్ షేక్



చాలా వరకు ప్రతి ఒక్కరూ మామిడి మిల్క్ షేక్, అరటి పండు మిల్క్ షేక్‌లను ఎక్కువగా తాగుతుంటారు. కానీ క్యారెట్‌తో మిల్క్ షేక్ చేసి తాగితే రుచి అదిరిపోతుందంట. కాగా, ఇప్పుడు మనం క్యారెట్ మిల్క్ షేక్ చాలా సులభంగా ఎలా చేయాలో చూసేద్దాం. కావాల్సిన పదార్థాలు : క్యారెట్ మిల్క్ షేక్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో విటమిన్స్ పుష్కలంగా ఉండటమే కాకుండా,వీటిలోనే తురిమిన క్యారెట్ కూడా వేసుకోవాలి. మంచిగా మిక్సీ పట్టుకోవాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు కప్పు పాలు తీసుకోవాలి. స్టవ్ ఆన్ చేసి, పాన్ పెట్టాలి. అందులో పాలు పోసి, పాలు చాలా చిక్కగా, వచ్చే వరకు కలుపుతూ ఉండాలి. ఇది చక్కటి పేస్ట్ వచ్చే వరకు లో ఫ్లేమ్ మంటపై పాలు పోసి మరగబెట్టుకోవాలి.

ఒటిటి ఎంట్రీకి రెడీ అయిన సుమంత్ మూవీ.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?



సుమంత్ హీరోగా సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ మూవీ 'మహేంద్రగిరి వారాహి'. గత నెలలో థియేటర్లలో విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులకు మంచి థ్రిల్‌ను పంచింది. సుమంత్ నటన, విరామ ఘట్టాలు, క్లైమాక్స్ సినిమాలో హైలైట్‌గా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా ఒటిటి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ప్రముఖ ఒటిటి వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అక్టోబర్ 2వ తేదీ నుంచిఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఇది అందుబాటులో ఉండనంది.

కాజల్ అగర్వాల్ 'ది ఇండియా స్టోరీ' సర్‌ప్రైజ్..



ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ నటించిన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ: స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్'. ఈ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలో శ్రేయస్ తల్పాడే, మురళఈ శర్మ కీలక పాత్రల్లో నటించారు. చేతన్ డికె దర్శకత్వం వహించారు. దేశంలో పెస్టిసైడ్ కంపెనీల మోసాలు, పంటల ఎరువుల్లో రసాయనాల అతి వినియోగం, వాటి వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ చిత్రంలో చూపించారు. ఈ కోర్ట్ రూమ్ డ్రామా సినిమాలో కాజల్ అడ్వకేట్ అర్చన పాత్రలో నటించారు. బహుభాషా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా జులై 24న థియేటర్లలో విడుదలైంది. సెప్టెంబర్ 18 నుంచి జియో హాట్‌స్టార్‌లో హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ అవుతోంది.

"నమ్మి మోసపోయా".. మోహన్‌బాబు సంచలన వ్యాఖ్యలు!



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన సనిమా 'ది ప్యారడైజ్'. కొన్ని రోజుల క్రితం విడుదలైన ఈ సినిమాకు మిక్స్‌డ్ టాక్ వచ్చింది. అయినప్పటికీ కలెక్షన్ల పరంగా సినిమా సక్సెస్‌ని సాధించింది. ఇక ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్‌బాబు శిఖంజా మాలిక్ అనే పాత్రలో నటించారు. ప్రతినాయకుడిగా ఆ నటన వేరే లెవటల్‌లో ఉంది. అయితే ఓ విషయంలో దర్శకుడు శ్రీకాంత్ తనని మోసం చేశాడని మోహన్ బాబు తెలిపారు. తన పాత్రకు హీరోయిన్ ఉంటుందని శ్రీకాంత్ చెప్పారని.. కానీ, షూటింగ్ ప్రారంభం అయ్యాక మాట మార్చాడని పేర్కొన్నారు. "శ్రీకాంత్ నా దగ్గరకు కథ చెప్పడానికి వచ్చినప్పుడు. నాకు భార్య పాత్ర ఉంటుందని చెప్పాడు. మా ఇద్దరి మీద వచ్చే సీన్లు కూడా వివరించాడు. ఆ పాత్రలో పాత హీరోయిన్లు వద్దని కొత్త వాళ్లను తీసుకోవాలని నేను సూచించా. అతడు కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత షూటింగ్ మొదలై ఓ షెడ్యూల్ కూడా పూర్తయింది. కానీ నా భార్య పాత్రకు సంబంధించిన సీన్లేవీ తీయలేదు. అప్పుడు శ్రీకాంత్‌ను పిలిచి అడిగితే.. 'చావు కబురు చల్లగా' అన్నట్లు అనలు విషయం బయటపెట్టాడు. ముందు అనుకున్న సీన్లు మారిపోయాయని, అందుకే ఇందులో భార్య పాత్ర ఉండదన చెప్పాడు" అని మోహన్‌బాబు వివరించారు. ఆయన మాటలకు నాని, శ్రీకాంత్ నవ్వేశారు.

స్మార్ట్‌ఫోన్లే కాపురాలను కూల్చేస్తున్నాయి..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, నేటితరం జంటల వైవాహిక జీవితాలు, మారుతున్న జీవనశైలిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నేటి డిజిటల్ యుగంలో మనుషుల మధ్య సహనం పూర్తిగా తగ్గిపోయిందని, ఒకరినొకరు అర్థం చేసుకునే టైమ్ ఇవ్వకుండా చిన్న చిన్న కారణాలకే విడిపోవడానికి సిద్ధపడుతుండటం బాధాకరమని కాజల్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల వాడకం మితిమీరిపోవడం భార్యాభర్తల బంధాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని చెప్పారు. పక్కనే ఉన్న భాగస్వామితో మాట్లాడుకోవడం మానేసి, డిన్నర్ డేట్స్‌కి వెళ్లినా కూడా చేతుల్లో ఫోన్లు పట్టుకుని గంటల తరబడి సోషల్ మీడియాలో స్క్రోలింగ్ చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. భార్యాభర్తల మధ్య ఓపెన్ కమ్యూనికేషన్ లేకపోవడం, ఎదుటివారి అభిప్రాయాలను వినే ఓపిక లేకపోవడం వల్లే బంధాలు బలహీనపడికోర్టుల వరకు వెళ్లాల్సి వస్తోందని హెచ్చరించారు. స్మార్ట్‌ఫోన్లే చాలామంది కాపురాలను కూల్చేస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే మైవాహిక జీవితం గురించి కూడా కాజల్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను, తన భర్త గౌతమ్ కిచ్లూ ప్రతి వారం కచ్చితంగా ఒకరోజు డిన్నర్ కోసం బయటకు వెళ్తామని తెలిపారు. ఆ సమయంలో ఫోన్‌లను పూర్తిగా పక్కన పడేసి, కేవలం ఒకరితో ఒకరు ప్రశాంతంగా సమయాన్ని గడుపుతామని చెప్పారు. బలమైన అనుబంధానికి గాడ్జెట్లు కాకుండా, మనసు విప్పి మాట్లాడుకోవడమే అసలైన రహస్యం అని ఆమె స్పష్టం చేశారు. కాగా, కాజల్ - గౌతమ్ కిచ్లూ దంపతులు 2020లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. ప్రస్తుతం తల్లి అయ్యాక కూడా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తూ, వరుస సినిమాలతో కాజల్ దూసుకుపోతున్నారు.



అనుకున్న సమయానికే 'కింగ్ 100'...



కింగ్ నాగార్జున ప్రతిష్టాత్మక 100వ సినిమా 'కింగ్ 100'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా విడుదల తేదీని ఇప్పటికే ప్రకటించారు. డిసెంబర్ 24న సినిమాను క్రిస్మస్ కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు షూటింగ్ విషయమై ఎలాంటి అప్‌డేట్ లేదు. నాగార్జున బర్త్‌డే సందర్భంగా సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో ఇంత తక్కువ సమయంలోనే సినిమా పూర్తవుతుందా అనే అనుమానాలు కొందరిలో ఉన్నాయి. కానీ తాజా సమాచారం ప్రకారం సినిమా విడుదల విషయంలో ఎలాంటి మార్పు ఉండదట. సినిమాను ఇటీవల నాగార్జున బర్త్‌డే సందర్భంగా ప్రకటించినప్పటికీ సినిమా షూటింగ్ ప్రారంభమై చాలా కాలం అయిందట. సినిమాను ప్రకటించే సమయానికి షూటింగ్ దాదాపుగా సగం పూర్తయిందని తెలిసింది. ఇక నవంబర్‌లోనే మొత్తం షూటింగ్‌ను పూర్తి చేసి డిసెంబర్ మొదటి వారం వరకు ఫస్ట్ కాపీని రెడీ చేసే విధంగా దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. డిసెంబర్ 24న సినిమాను క్రిస్మస్ కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు షూటింగ్ విషయమై ఎలాంటి అప్‌డేట్ లేదు. నాగార్జున బర్త్‌డే సందర్భంగా సినిమాను ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో ఇంత తక్కువ సమయంలోనే సినిమా పూర్తవుతుందా అనే అనుమానాలు కొందరిలో ఉన్నాయి. కానీ తాజా సమాచారం ప్రకారం సినిమా విడుదల విషయంలో ఎలాంటి మార్పు ఉండదట. సినిమాను ఇటీవల నాగార్జున బర్త్‌డే సందర్భంగా ప్రకటించినప్పటికీ సినిమా షూటింగ్ ప్రారంభమై చాలా కాలం అయిందట.